నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 14 ఏప్రిల్ 2024 | KAMAREDDY

- ఉమ్మడి జిల్లాలో భారీగా తడిసిన ధాన్యం
- సెలవులతో పత్తా లేని వ్యవసాయాధికారులు
- పంటనష్టం అంచనాలపై కాకి లెక్కలతోనే సరి
- నేలరాలిన వడ్లతో భారీగా నష్టాలు

అకాల వానతో రైతులు ఆగమాగం

రైతు గోస పట్టేదెవరికి?

సోమేశ్వర్ శివారులో ఆరబెట్టిన ధాన్యంలో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు

నిజామాబాద్, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అకాల వానలు రైతన్నలకు కన్నీళ్లు మిగిల్చాయి. కోతకు వచ్చిన పంట నేలరాలింది. పలుచోట్ల ధాన్యం తడిసింది. లాభాలు ఆశించిన శ్రమజీవికి అనుకోని ఉపద్రవంతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వచ్చింది. పంట నష్టాలపై లెక్కలు తీయాల్సిన వ్యవసాయశాఖ అధికారులు వరుస సెలవుల ప్రభావంలోనే కొట్టుమిట్టాడడంతో రైతులను క్షేత్రస్థాయిలో పట్టించుకునే వారు కరువయ్యారు. కొనుగోళ్లలో వేగం లేకపోవడం కూడా ధాన్యం తడవడానికి కారణమవుతున్నది. ధాన్యం సేకరణ వేగంగా జరిగి ఉంటే వడ్లు కల్లాలు దాటుకొని ప్రభుత్వాధీనంలోకి వెళ్లేవని రైతులు అంటున్నారు. తడిసిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు తల పట్టుకుంటున్నారు.

తడిసిన ధాన్యం కొంటారా?

ప్రభుత్వం మారిన తర్వాత కాంగ్రెస్ హయాంలో తొలిసారి చేపడుతున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ అస్తవ్యస్తంగా జరుగుతున్నది. ఏప్రిల్ 1న కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. నేటి వరకు 15వేల మంది రైతుల నుంచి రూ.235కోట్లు విలువ చేసే 1.06లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిజామాబాద్ జిల్లాలో సేకరించినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఉవ్వెత్తున వస్తున్న ధాన్యానికి తగ్గట్టుగా కేంద్రాల్లో సేకరణ జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యంతో ప్రైవేటు దళారులకు లాభం చేకూరుతున్నట్లుగా తెలుస్తున్నది. పీఏసీఎస్ కేంద్రాల్లో బిహారి కూలీల కొరత కూడా ఇందుకు కారణంగా నిలుస్తోంది. మధ్యవర్తులు వెంటనే వాలిపోతూ రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని కొంటున్నారు. దీంతో కనీస మద్దతు ధర కన్నా తక్కువకే విక్రయించుకొని రైతులు అంతటికే సంబురపడాల్సి వస్తున్నది. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పూర్తి స్థాయి వసతులతో ధాన్యం సేకరణ జరిగింది. వివిధ శాఖల సమన్వయంతో కొనుగోళ్లు పకడ్బందీగా జరిగేవి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పుడు అకాల వానలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయంపై ఎలాంటి హామీ రాకపోవడంతో అధికారులు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. గతంలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొని రైతులకు మేలు చేసిందని పలువురు రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

రైతుకు దిక్కెవరు?

ధాన్యం సేకరణ సమయంలో కీలకమైన శాఖలు యాక్టివ్‌గా ఉండాల్సిన అవసరం ఉంటుంది. వారం రోజులు వరుసగా సెలవులు రావడంతో వ్యవసాయ శాఖలో సగానికి ఎక్కువ మంది అందుబాటులో లేకుండా పోయారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి శుక్ర, శనివారాల్లో అకాల వాన కురిసినా పర్యటించిన వారెవ్వరూ కనిపించలేదు. ఉన్నతాధికారుల పట్టింపులేని తనంతో ఇదంతా జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఏఈవోలపై అజమాయిషీ లేకపోవడంతో ఇష్టారీతిన శాఖ పని తీరు కనిపిస్తున్నది. పంట నష్టం, తడిసిన ధాన్యం లెక్కలను సేకరించేందుకు జూమ్ మీటింగ్‌లకు తప్ప ఫీల్డ్ విజిట్లకు పోలేదన్న అపవాదు కూడా వినిపిస్తున్నది. రెవెన్యూ, సహకార శాఖలకు చెందిన వారెవ్వరూ రైతుల వివరాలను కూడా సేకరించలేదు. ఇకపోతే ఫక్తు రాజకీయాలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులకు ప్రజలు, రైతులు పట్టడం లేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. నెల రోజుల్లోనే వడగళ్ల వానతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించి రైతులను కలిసినప్పటికీ వారికి సాంత్వన చేకూరలేదు. లోకల్ లీడర్లు, ఎమ్మెల్యేలైతే రైతుల వద్దకు వెళ్లి పలుకరించిన పాపాన పోలేదు. ఇప్పుడు అకాల వానతో తడిసిన ధాన్యంతో నష్టాలు చవిచూస్తున్న రైతులను కూడా పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఎంపీ ఎన్నికల్లో ప్రచారాలు, చేరికలపై కాంగ్రెస్ పార్టీ చూపుతున్న ఆసక్తి... రైతులపై లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తున్నది.

పంట నష్టం లేదు..

పంట నష్టం ఏమీ జరుగలేదు. మా వాళ్లంతా నిరంతరం టచ్‌లో ఉన్నారు. జూమ్ మీటింగ్ నిర్వహించాం. అంచనాలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు. చిన్న పాటి వానలే కురిశాయి. ఎక్కడైనా పంటలు దెబ్బతింటే సమాచారం ఇవ్వాల్సిందిగా కోరుతున్నాం.

- వాజిద్ హుస్సేన్, వ్యవసాయ శాఖ అధికారి, నిజామాబాద్

ధాన్యం సేకరణలో వేగం పెంచాలి

-అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం

ఇందల్వాయిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఇందల్వాయి, ఏప్రిల్ 13: జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. మండలంలోని తిర్మన్‌పల్లిలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి శనివారం సందర్శించారు. కేంద్రాల్లో రైతులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడి.. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులుంటే అధికారులకు తెలియజేయాలన్నారు. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లేదా రాష్ట్రస్థాయిలో అందుబాటులో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్‌కు కూడా ఫిర్యాదులు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని రైతులకు సూచించారు. తొందరపడి దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు.

మోపాల్ మండలం బోర్గాం(పీ)లో నేలకొరిగిన వరి పంట

ఆగంజేసిన అకాల వాన..

- నేలరాలిన వడ్లు.. కల్లాల్లోకి నీళ్లు
- ధాన్యం తడిసి అపార నష్టం
- ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 13: అకాల వాన రైతులను ఆగంజేసింది. రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన ధాన్యం కండ్లెదుటే నీటిపాలయ్యింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట దెబ్బతినడంతో రైతన్నలు కంటతడి పెడుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వానతో ఊహించని నష్టంవాటిల్లింది. ఈదురుగాలులకు వరిపైరు నేలకొరగా, అకస్మాత్తుగా వచ్చిన వర్షంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల తూకం వేసి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు సైతం వానధాటికి తడిసిపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అకాల వానకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యం కుప్పలు

బాన్సువాడ, బీర్కూర్, కోటగిరి, వర్ని, నస్రుల్లాబాద్ మండలాల్లో ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు గాలికి ఎగిరిపోయాయి. ధాన్యం కుప్పలన్నీ తడిసి పోవడంతో నిల్వ ఉన్న వర్షపు నీటిని రైతులు తొలగించారు. ఉమ్మడి కోటగిరి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆర బెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ పట్టాలు కప్పిన పలుచోట్ల ధాన్యం తడిసిపోయిందని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే తుకాలు వేసి ధాన్యాన్ని తరలించాలని రైతులు కోరారు.



దోమలెడ్గిక్యాంప్‌లో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన వర్షపు నీరు

దోమలెడ్గిలో తడిసిన వడ్ల సంచులు

మోపాల్ మండలం కంజరలో తడిసిన ధాన్యం

వడ్లు పూర్తిగా తడిసిపోయినయ్..

కోటగిరి, ఏప్రిల్ 13: ఎంతో కష్టపడి వరి పంట పండించాం. నాలుగు ఎకరాల్లో సాగు చేశా. దిగుబడి బాగానే ఉన్నా అకాల వర్షం మా సంతోషంపై నీళ్లు చల్లింది. వడ్ల కుప్పలన్నీ తడిసిపోయాయి. తడిచిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- షేక్ హుస్సేన్, రైతు, దోమలెడ్గి, పాతంగల్ మండలం

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఖలీల్‌వాడి (మోపాల్), ఏప్రిల్ 13: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి. కొనుగోలు కేంద్రాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అకాల వర్షాలతో రైతులకు కష్టమొచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు.

-సురేశ్, బోర్గాం, మోపాల్ మండలం

తీవ్రంగా నష్టపోయా..

నేను ఎకరానికి రూ.30వేలు పెట్టి 25 ఎకరాలు కౌలు తీసుకున్న. ఆరుగాలం కష్టం చేసి పంట చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయాను. వరి ధాన్యం రాలిపోయింది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

- మౌలాన, రైతు, ఇలేగావ్, డోంగ్లీ

కోసిన జొన్న తడిసింది..

నేను ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని జొన్న పంట వేసిన. పంట చేతికి వచ్చింది. కోత కోసి కుప్ప చేసే సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో జొన్న మొత్తం తడిసింది. అధికారులు, ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి.

- నాగురావు, రైతు, డోంగ్లీ

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి

- లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీలను చిత్తుగా ఓడించాలి
- కాంట్రాక్టుల కోసమే పార్టీ మారిన బీబీ పాటిల్
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మాజీ స్పీకర్ పోచారం

కామారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పక్కన జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 13: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డి, మహ్మద్‌నగర్‌లో శనివారం బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఎల్లారెడ్డి, మహమ్మద్‌నగర్‌లో పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, మూడు నెలల పాలనలో ఆ పార్టీ నిజస్వరూపం సామాన్యుడికి సైతం తెలిసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి కర్త, కర్మ, క్రియ కార్యకర్తలేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనపై గ్రామాల్లో చర్చ నిర్వహిస్తే ఓటు కారు గుర్తుకే వస్తుందని అన్నారు. తప్పు చేసిన వారిని శిక్షించే సమయం వచ్చిందని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు గుణ పాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పదేండ్లపాటు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఇప్పుడు మళ్లీ ఎందుకు ఓటు వేస్తామని ప్రజలు అంటున్నారని తెలిపారు. ఆయన కేవలం కాంట్రాక్టు పనుల కోసం పార్టీలు మారి టికెట్ తెచ్చుకున్నారని విమర్శించారు. ఓట్లు రాగానే శ్రీరాముని పేరు చెప్పడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా బీజేపీ లబ్ధి పొందుతున్నదని విమర్శించారు.

కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా రాదు..

బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

జహీరాబాద్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించి కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను తిట్టడం తప్ప వేరే పని లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదన్నారు. బీఆర్ఎస్ ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసే బీఆర్ఎస్ పార్టీని ఈ సారి విజయం వరిస్తుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎల్లారెడ్డి, నాగిరెడ్డి పేట, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది..

-మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి, ఏప్రిల్ 13: ప్రజలను మోసం చేసే చరిత్ర కాంగ్రెస్ పార్టీ సొంతమని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ కల్యాణమండపంలో కామారెడ్డి, రామారెడ్డి మండలాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గంప గోవర్ధన్ హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని సక్రమంగా అమలుచేయడంలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారి కుటుంబాలే బాగుపడ్డాయి తప్ప, ప్రజలు బాగుపడలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసిందన్నారు. వరికి రూ.500 బోనస్‌పై ప్రభుత్వం నుంచి ఇప్పటికీ స్పందన కరువైందన్నారు. పదేండ్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ పాల్గొన్నారు.

ఒడ్యాట్‌పల్లిలో విషాదం

ఈతకు వెళ్లి ముగ్గురు యువకుల మృతి

- ఒకరిని కాపాడిన యువకుడు

మాక్లూర్, ఏప్రిల్ 13: అప్పటి వరకు షటిల్ ఆడిన పిల్లలు.. చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి విగతజీవులవ్వడంతో మూడు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఒక్కో కుటుంబానికి ఒక్కడే కొడుకు కావడం.. ఆ ఒక్క కొడుకు కూడా మరణించడంతో వారి రోదనలు మిన్నంటాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడ్యాట్‌పల్లికి చెందిన నీరుగొండ నరేశ్(19), చిత్తారి మహేశ్(19), వినోద్, సాయితేజ, వెంకటేశ్ అలియాస్ తిరుపతి(15)లు మధ్యాహ్నం 3గంటల వరకు సాయితేజ ఇంటి వద్ద షటిల్ ఆడారు. ఉక్కపోతతో చెమటలు రావడంతో గ్రామ శివారులోని ధర్మాడి చెరువులో స్నానానికి వెళ్లారు. రాసురి సాయితేజ, నివేశ్‌తో కలిసి చెరువు వద్దకు ఆలస్యంగా వెళ్లగా అప్పటికే మిగతా నలుగురు స్నానానికి దిగారు. చెరువు లోతుగా ఉండడంతో కాపాడాలని కేకలు వేయడంతో పరిగెత్తుకుంటూ వచ్చిన సాయి తేజ ,నివేశ్.. వినోద్‌ను కాపాడగా, మిగతా ముగ్గురు నరేశ్, మహేశ్, తిరుపతి నీటిలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబీకులు చెరువులో గాలించి ముగ్గురి మృతదేహాలను బయటికి తీశారు. మృతుల్లో ఒకరైన తిరుపతి ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశాడని, మహేశ్ జీపీ చెత్త ట్రాక్టర్ నడుపుతుండగా, నరేశ్ కూలీ పని చేస్తాడని తెలిపారు. ముగ్గురు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని ఓఎస్‌డీ శేషాద్రినీరెడ్డి, నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై సుధీర్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్ర దవాఖానకు తరలించారు.

రెండు రోజుల్లో దుబాయికి..

మృతుడు నీరుగొండ మహేశ్ బతుకుదెరువు కోసం సోమవారం దుబాయి వెళ్లాల్సి ఉన్నదని కుటుంబ సభ్యులు తెలిపారు. తన కుమారుడు నాలుగురాళ్లు సంపాదించేందుకు దుబాయి వెళ్లేందుకు అన్నీ సర్దుకున్నాడని ఇంతలోనే చనిపోయి తమకు తీరని శోకం మిగిల్చాడని తండ్రి గంగాధర్ దిక్కులు పిక్కటిల్లేలా రోదించడంతో గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు.

రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

'పొద్దు తిరుగుడు' కొనుగోలుకు సర్కారు అనుమతి

కోటగిరి, ఏప్రిల్ 13 : 'పొద్దు' కొనుగోలుపై మొద్దు నిద్ర! అనే శీర్షికతో ఈ నెల 6వ తేదీన నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అలాట్‌మెంట్ అయ్యేలా కృషి చేశారు. దీంతో హెగ్డోలి లోని పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రానికి 10వేల గన్నీ బ్యాగులు, ప్రస్తుతం 5వేల క్వింటాళ్ల పొద్దు తిరుగుడు కొనుగోలుకు అలార్ట్‌మెంట్ వచ్చినట్లు పాతంగల్ వ్యవసాయ విశాల సహకార పరపతి సంఘం నిర్వాహకులు తెలిపారు. కొనుగోళ్లకు అనుమతివ్వడంపై రైతులు హర్షం వ్యక్తంచేశారు.